



అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

చదువుల తల్లికి నీరాజనం

- బాసరకు తరలివచ్చిన భక్తజనం
- వసంత పంచమి ఉత్సవాల చివరి రోజు భారీ సంఖ్యలో భక్తుల హాజరు
- దినమంతా ఆలయంలో చిన్నారుల అక్షర శ్రీకార పూజల కోలాహలం
- గంటల తరబడి బారులు తీరిన భక్తులు
- గంటల తరబడి వేచి ఉన్న భక్తులు
- అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన కలెక్టర్ అభిలాష అభినవ్
- పూజటిక్కెట్‌ల ద్వారా ఆలయానికి రూ. 58లక్షల ఆదాయం
- కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ భక్తులు

బాసర, ఫిబ్రవరి, 3: (ఆంధ్రజ్యోతి) : చదువుల మాత కొలువై ఉన్న బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రం సోమవారం భక్తులతో కళకళలాడింది. వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం రాత్రికే వేల మంది బాసర వచ్చి బస చేయగా ఉదయం తెల్లవారుజామున నుండే అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో చేరిపోయారు. ఆ తర్వాత సోమవారం ఉదయం నుంచి సాయంత్రం బాసరకు భక్తుల రాక కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఇతర రాష్ట్రాల సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి జయంతోత్సవమైన ఈ వసంత పంచమి పర్వదినాన అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకార పూజలు జరిపించే భక్తులే అధికం. బాసర క్షేత్రంలో పరిసరాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. రైళ్లు, ఆర్టీసీ బస్సులు అమ్మవారి భక్తులతో కిక్కిరిసి పోయాయి.

అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన కలెక్టర్

అమ్మవారి జయంతి సందర్భంగా సరస్వతీ అమ్మవారికి కలెక్టర్ అభిలాష అభినవ్ పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య శోభాయాత్రగా వెళ్లి అమ్మ



అక్షర శ్రీకార పూజల్లో భక్తుల మధ్య తోపులాట

వారికి కలెక్టర్ ... ఉన్నందున జిల్లా అధికారులు పట్టువస్త్రాలను ప్రభుత్వం తరఫున సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ఈ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శరత్ పాఠక్ పాల్గొన్నారు.

వెయ్యి రూపాయల టికెట్‌కు 5 గంటలకు పైగా .. రూ. 150 టికెట్ పై 2 గంటల లోపే పూజలు

వసంతపంచమి వేడులకు హాజరైన భక్తుల్లో సింహభాగం పిల్లలకు అక్షర శ్రీకార పూజల కోసం వచ్చిన వారే ఉన్నారు. ఈ సారి అమ్మవారి జయంతి రోజైన వసంతపంచమి నాడు అక్షర శ్రీకార పూజలు జరిపించేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. ఈ సారి పంచమి గడియలు రెండు రోజులు ఉండడంతో ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు రద్దీ కొనసాగింది. ఆదివారం క్యూలైన్లన్నీ పిల్లలకు అక్షర శ్రీకారం చేయించే భక్తులతో నిండిపోయాయి. వెయ్యి రూపాయల టికెట్, రూపాయలు 150 రెండు రకాల టికెట్ లతో అధికారులు పూజలు ఏర్పాటు చేశారు. అయితే ప్రతిసారి లాగే ఇసారి కూడా రూ. వెయ్యి రూపాయల టికెట్ క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసి పోగా రూ.150 టికెట్ గల క్యూలైన్‌లో భక్తుల రద్దీ పలుచగా కనిపించింది. ఎక్కువ డబ్బులు చెల్లించిన భక్తులు 5 నుంచి 8 గంటల పాటు సమయం పట్టగా రూ. 150 టికెట్ తీసుకున్న వారికి 2 గంటల లోపే పూజలు పూర్తయ్యాయి.

భక్తులకు కష్టాలు షరా మామూలే..

అరుదైన సరస్వతీ దేవాలయాల్లో రెండవ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బాసర అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకార పూజలు జరిపించుకోవడం భక్తుల కోరిక. అందుకే ప్రతి సంవత్సరం ఆయా ఉత్సవాల్లో అనేక అసౌక ర్యాలు ఏర్పడ్డప్పటికి బాసరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉన్న ది. చాలా ఆలయాల్లో అక్షర శ్రీకార పూజలు జరుతున్నప్పటికీ బాసరలో నిర్వహించాలనే బలమైన కోరికతో ఇక్కడికి వస్తున్న భక్తులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు. ఎప్పటి లాగే ఈ సారి కూడా ఉత్సవాలకు వచ్చి న యాత్రికులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారు. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్ర శాలలు, సమాచార కేంద్రాలు లేక పసి పిల్లలు, వృద్ధులతో క్యూలైన్లలో గంటల తరబడి వేచి చూస్తూ భక్తులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. ఏర్పాట్లు సరిగ్గా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాపనార్థాలు పెట్టారు. ఉత్సవాల కంటే ముందు అధికార యంత్రాంగం హడావుడి తప్ప ఈ సారి కూడా భక్తులకు ఏర్పాట్ల విషయంలో నిరాశే ఎదురైంది. రూ. కోట్ల ఆదాయం ఉన్నప్పటికీ.. కనీసం క్యూలైన్లలో తాగునీటిని ఏర్పాటు చేయలేని దుస్థితిలో దేవస్థాన యంత్రాంగం ఉంది.

5724 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ తగ్గలేదు. పూజల కోసం భక్తులు క్యూలైన్లలో 5 గంటలకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. సోమవారం ఒక్కరోజు 5724 మంది చిన్నారులు అక్షర శ్రీకార పూజలు జరిపించుకున్నారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి చూస్తున్న భక్తులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా సరిగ్గా ఏర్పాటు చేయలేకపోయారు. అసౌకర్యాలతో పిల్లలు, వృద్ధులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కరోజే వివిధ పూజాటిక్కెట్‌ల విక్రయం ద్వారా ఆలయానికి రూ. 58 లక్షల ఆదాయం సమకూరింది.

ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



ప్రాక్టికల్ పరీక్షలను తనిఖీ చేస్తున్న డీఐఈవో

భైంసా, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 వరకు ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున పరీక్షలు జరుగనున్నాయి. భైంసాలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో జరగుతున్న బోటని ప్రాక్టికల్ పరీక్షలను సోమవారం ఉదయం జిల్లా ఇంటర్ విద్యాధికారి పరుశురామ్ నాయక్ తనిఖీ చేశారు. డీఈసీ సభ్యులతో కలిసి ఇక్కడకు వచ్చిన డీఐఈవో ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రాక్టికల్ చేసే విదానాన్ని పర్యవేక్షించారు. విద్యార్థుల రికార్డు రాత పుస్తకాలను పరిశీలించారు. లోపాలకు తావు లేకుండా ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని పరీక్షా కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మూడు విడుతలలో సోమవారం ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 22న ముగియనున్నట్లుగా డీఐఈవో పరుశురామ్ వెల్లడించారు. .

ట్రస్మా ఆధ్వర్యంలో మిస్సైల్స్ మోడళ్ల ప్రదర్శన

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ అండ్ ఎక్సలెన్స్ వారు భారతీయ స్పేస్, డిఫెన్స్‌కు సంబంధించిన వివిధ మిస్సైల్స్, ఇతర సాటిలైట్స్ మోడల్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణంలోని రవి హైస్కూల్‌లో ఈ నెల ఐదో తేదీన ఇస్రోకు సంబంధించిన శాస్త్రవేత్తలతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇన్స్‌పైర్ ఉపన్యాసాలు ఉంటాయని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని తెలిపారు.

రక్తదానం చేసిన బాగాపూర్ యువకులు

లోకేశ్వరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాగాపూర్ గ్రామానికి చెందిన హర్ష అనిత(37)కు ఏబీ పాజిటివ్ రక్తం అత్యవసరమని మా అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఎం. ఆంజనేయులు సోషల్ మీడియా ద్వారా కోరగా వెంటనే స్పందించిన పుష్పూర్ గ్రామానికి చెందిన యువకుడు చంద్రశేఖర్, చించోలి గ్రామానికి చెందిన వివేక్ అనే యువకులు వెళ్లి వారి విలువైన రక్తాన్ని దానం చేశారు. వారికి మా అమ్మానాన్న ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడా రు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సమయాల్లో యువకులందరూ ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారికి ఆదుకొని రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలన్నారు.

'కార్మికులకు నూతన సభ్యత్వ కార్డులను అందించాలి'

సారంగాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు నూతన సభ్యత్వ కార్డులను అందించాలని తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. సోమవారం జిల్లా కార్మిక శాఖ ముత్యం రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలను అందేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో కార్మికులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. కార్మికులందరూ సభ్యత్వ కార్డులను పొందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భిక్షాటన చేస్తూ ఆదివారం రాత్రి వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో భిక్షాటన చేస్తూ రాత్రి సమయంలో గండిరామన్న సాయిబాబా మందిరం వద్ద ఉంటూ చిన్న చిన్న పనులు చేసే అర్జున్ పండిట్ అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం సమయంలో సాయిబాబా గేటు దగ్గర అపస్మారక స్థితిలో పడిపోగా జోగు భూషణ్ అనే వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా చికిత్స పొందుతూ రాత్రి చనిపోయాడని డాక్టర్లు తెలిపారు. మృతుడి కుటుంబీకులు, బంధువుల వివరాలు తెలియవని, హిందీ భాషలో మాట్లాడుతాడని తెలిపారు.

కరెంటు షాక్‌తో ఒకరి మృతి



సోన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన బోర నర్సయ్య కరెంటు షాక్ తగిలి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... బోర నర్సయ్య అనే వ్యక్తి తాను కౌలుకు తీసుకున్న తోటలో మొక్కజొన్న పంటకు అడవి పందుల రక్షణ కోసం ఎర్తింగ్ వైర్‌తో పాటు బల్బును ఆదివారం రాత్రి పెట్టాడు. సోమవారం ఉదయం ఎర్తింగ్ వైర్ తీసే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి చనిపోయాడు. మృతుడి కొడుకు దీక్ష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సోన్ ఏఎస్సై షేక్ హైమద్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం

కుభీర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల ప్రకారం... సోమవారం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా భోకర్ నుంచి కుభీర్‌కు వస్తున్న టవేరా వాహనంలో మహారాష్ట్రకు చెందిన అక్రమ మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం మొత్తం 17.64లీటర్లు, వాటి విలువ రూ. 19,404 రూపాయలు కలదని, చికిలి గ్రామానికి చెందిన ర్యాపన్‌వార్ శ్రీనివాస్ అనే వ్యక్తి మద్యాన్ని తరలిస్తున్నట్లుగా తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

యాసంగి డిజిటల్ పంటల సర్వే ప్రారంభం

పెంబి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగి కాలం సీజన్‌లో రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలకు సంబంధించిన పంటల నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ నాయక్ సోమవారం తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నాలో పార్టీ నేతల ఆగ్రహం
- జిల్లావ్యాప్తంగా ఆందోళనలు



జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2025-26 సంవత్సర ఆర్థిక బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉన్న కేంద్రం తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో సుమారు రూ. లక్ష వేల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న కేంద్రప్రభుత్వం కనీసం రూ. 40 వేల కోట్లు తిరిగి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల రాష్ట్రాలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవనాని, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హాది, కాంగ్రెస్ నాయకులు కొట్టే శేఖర్, పూదరి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష ధోరణితో వ్యవహరిస్తోంది

భైంసా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం పై కేంద్ర ప్రభుత్వం వివక్షత దోరణి విధానాలతో వ్యవహరిస్తోందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భైంసాలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొ ని మాట్లాడారు. నిధుల కేటాయింపు ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అవసమైన బడ్జెట్ కేటాయింపులు చేపట్టలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులు కేటాయించి తెలంగాణకు నామమాత్రంగా కేటాయింపులు చేపట్టడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. బీఆర్, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, ఫారుఖ్ అహ్మద్,కాంగ్రెస్ ప్రతినిధులు బాశెట్టి రాజన్న, మైసేకర్ సాయిలు, ప్రసంజిత్ ఆగ్రేతో పాటు నియోజక వర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల పార్టీ ప్రతినిదులు,శ్రేణులు పాల్గొన్నారు.

● రాష్ట్రానికి తీరని అన్యాయం

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేసిందని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నుమాన్, భైంసా పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఓం ప్రకాష్ లడ్డా, యూత్ కాంగ్రెస్ ముథోల్ నియోజక వర్గ అధ్యక్షులు షఫీ, అధికార ప్రతినిధి ఆహద్ సాహిల్, కుంటాల మండల అధ్యక్షులు మహేష్‌లతో పాటు పార్టీ ప్రతినిధులు ఆరోపించారు. పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా స్థానిక బస్టాండ్ ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు చేపట్టారు

స్వరాష్ట్రానికి నిధులు తేలేని మంత్రులు తక్షణమే రాజీనామా చేయాలి

ఖానాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్వరాష్ట్రానికి నిధులు తేలేని కేంద్ర మంత్రులు తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపిస్తూ సోమవారం ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లోని పాత బస్టాండ్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీకి తెలంగాణ ప్రజలు 8 మంది ఎంపీలను ఇస్తే మోదీ మాత్రం కేంద్ర బడ్జెట్‌లో మొండి చేయి చూపడం ఎంతవరకు సమంజసమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు యూసుఫ్ ఖాన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

దస్తురాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూపాయి కూడా కేటాయించకుండా చిన్నచూపు చూసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కడెంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కడెం కాంగ్రెస్ నేతలు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కడెంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు కట్టుకొని కడెంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలు, ఎన్డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకే నిధులు దక్కాయన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సంఖ్య స్థానంలోనే నెంబర్ 1 అని, కానీ అభివృద్ధిలో గుండు సున్నా అని అన్నారు.



భైంసాలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన ప్రదర్శన



దస్తురాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ఘనంగా గంగపుత్ర సంఘ భవనం ప్రారంభం



గంగపుత్ర సంఘ భవనంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఖానాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో మత్స్యశాఖ నిధులతో నిర్మించిన గంగపుత్ర సంఘం భవన ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌తో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి గంగపుత్ర మండలాల, గ్రామాల అధ్యక్షులు హాజరయ్యారు. సంఘ భవన ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హోమం, శివ పార్వతుల కళ్యాణం, దుర్గాదేవి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సురేష్, రమేష్, భీమన్న, రవి, భీమరాజం, లాలు, మరి రమేష్, గణేష్, రమేష్, సురేష్, రవి, భీమ్ రావు తదితరులున్నారు.

ఆలయ చైర్మన్‌ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న దేవరకోట దేవస్థానం ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్ సతీమణి వాణిశ్రీని సోమవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి జాగ్రత్తలు పాటించాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ కడెం యువజన విభాగం అధ్యక్షుడిగా స్వామి

ఖానాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ కడెం మండల యువజన విభాగం అధ్యక్షులుగా లింగాపూర్‌కు చెందిన కమ్మల స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కడెం మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు యువజన విభాగం అధ్యక్షులుగా కమ్మల స్వామిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని నూతనంగా నియమితులైన బీఆర్ఎస్ కడెం మండల యువజన విభాగం అధ్యక్షులు స్వామి తెలిపారు. యూత్ మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించిన జాన్సన్‌నాయక్‌కు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో వసంతపంచమి వేడుకలు



వాసవి పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న వేద పండితులు



భాష్యం పాఠశాలలో అక్షరాభ్యాసం..



ఎస్ఆర్ డీజీ పాఠశాలలో..

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాఘశుద్ధ పంచమిని పురస్కరించుకొని నిర్మల్ జిల్లాలోని పలు పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. పలువురు తమ చిన్నారులకు వాసవీ, భాష్యం, ఎస్ఆర్‌డీజీ పాఠశాలల్లో అక్షరాభ్యాసం చేయించి, పాఠశాలలో చేర్పించారు.

విజయ పాఠశాలలో..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని విజయ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరైన చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో వేద పండితుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బాసర నుండి తెప్పించిన కుంకుమ, ప్రసాదం ఇవ్వడంతో పాటు టీటీడీ నుంచి తెప్పించిన కంకణాలతో కంకణధారణ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ... మాఘశుద్ధి పంచమి నాడు ఉద్భవించిన దేవతగా ప్రసిద్ధి చెందిన సరస్వతీ మాత జన్మదినం కావున చిరంజీవులకు అక్షరాభ్యాస్యాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల జనరల్ సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య, వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీరం విజయలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ సామమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, పోషకులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

తానూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో, అంగన్‌వాడీల్లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ అమ్మవారి ఫోటోకు పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. తమ పిల్లలపై సరస్వతీ అమ్మవారి కటాక్షం ఉండాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుకున్నారు.

వేదం పాఠశాలలో..

లోకేశ్వరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టిన రోజు సందర్భంగా వేదం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వైష్ణవ పురోహితులు నరసింహ స్వామి ఆధ్వర్యంలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ స్వామి మాట్లాడుతూ... సోమవారం వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసాలు చేయడం వల్ల సరస్వతి దేవి సంపూర్ణ కరుణ, కటాక్షాలు సిద్ధిస్తాయని అలాగే విద్యాబుద్ధులను సరస్వతి దేవి ప్రసాదిస్తుందని సోమవారం అక్షరాభ్యాస కార్యక్రమం చేయడం శుభప్రదమని నరసింహ స్వామి తెలియజేశారు. వేదం స్కూల్ రమేష్ కరస్పాండెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్ కరస్పాండెంట్, రవి ప్రిన్సిపాల్, వేదం పాఠశాల టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు

ఖానాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల సరస్వతి దేవి ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. వేద పండితులు చక్రపాణి వాసుదేవాచార్యులు, చక్రపాణి నరసింహమూర్తిల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆయన కమిటీ అధ్యక్షులు అడ్డగడ్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, ఉపాధ్యక్షులు రామ్ భీమేశ్వర్, లింగాల రాము, తోట సత్యం, లింగాల లక్ష్మణ్, స్థానిక పద్మావతి నగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భైంసాలో..

భైంసా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): : పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు సరస్వతీ శిశు మందిరాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పలు ప్రైవేట్ పాఠశాలల్లో సరస్వతీ అమ్మవారి పూజ , యజ్ఞ కార్యక్రమాలు, సాముహిక అక్షర స్వీకార కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు, పాఠశాలల నిర్వాహకులు, బోధన సిబ్బంది భక్తి శ్రద్ధలతో సరస్వతీ అమ్మవారి పూజలను నిర్వహించారు. వేడుకలలో భాగంగా నిర్వహించి సంస్కృతిక ప్రదర్శనలు అహుతులను విశేషంగా అలరారించాయి.

ముథోల్ మండలం కేంద్రంలో..

ముథోల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాల, సరస్వతీ శిశుమందిర్ పాఠశాల, అక్షర పాఠశాలతో పాటు మండలంలోని ఫ్యూచర్ కాన్సెప్ట్, శ్రీవిద్యా ఆయా ప్రైవేట్ పాఠశాలలో సోమవారం వసంతపంచమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముథోల్‌లోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాలలో (కోలిగల్లీ - ముథోల్, విట్టోలి, తరోడా, దౌలతాబాద్)లలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణలతో గాయత్రి హోమం నిర్వహించారు. వక్తల ద్వారా వసంత పంచమి విశిష్టతను తెలియజేశారు. ఆచార్యులు భారతీయ సాంస్కృతి పరంపరలో భాగంగా షోడశ సంస్కారాలలో అక్షరాభ్యాసం (శ్రీకారం) గురించి వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. 131 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించినట్లు తెలిపారు.



విజయ పాఠశాలలో..



భోసి సమదేవుని ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



ఖానాపూర్‌లోని సరస్వతీదేవి ఆలయ ప్రాంగణంలో చిన్నారులు

మామడలో నూతన అంబులెన్స్‌కు పూజలు



నూతన వాహనానికి పూజ చేస్తున్న 108 ఈఎంటీ శేఖర్

మామడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మామడ మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన 108 అంబులెన్స్ వాహనానికి సోమవారం మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 వాహనాల కొరత కారణంగా ఇప్పటివరకు చాలా ఇబ్బందులు పడ్డ ప్రజలకు మండల కేంద్రానికి ఒకటి అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు 108 అంబులెన్స్ సద్వినియోగం చేసుకోవాలని ఈఎంటీ శేఖర్ పేర్కొన్నారు.

లక్ష డప్పులు - వెయ్యి గొంతులు విజయవంతం చేయండి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు - వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంట సునీత అన్నారు. సోమవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. మాదిగల బల ప్రదర్శన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున మాదిగలు, ఉప కులాలు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్గీకరణ చేపట్టాలన్నారు. పెంట సునీత, మహిళా జిల్లా అధ్యక్షులు, కోఆర్డినేటర్ శనిగారపు రవి, లక్ష్మణ్, బర్కుంట నరేందర్, ఎంహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు అశోక్, సాగర్, ముత్యం, అనిల్‌లు పాల్గొన్నారు.

జంతుజాల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

భైంసా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల పరిస్థితులతో కనుమరుగవుతున్న జంతుజాలం సంరక్షించేందుకు ప్రతి ఒకరు బాధ్యతగా వ్యవహరించాలని భైంసా పశువైద్యాధికారి డా.విఠల్ సూచించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పశువైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మానవ తప్పిదాల మూలంగా జంతుజాలం వేగంగా ఉనికిని కోల్పోతోందన్నారు. ప్రకృతిలో జీవిస్తూ ప్రకృతిని సంరక్షించే జీవజాలం అంతరించిపోతుండటంతో ప్రకృతి తన సమతుల్యతను కోల్పోయి అనే వైపరీత్యాలకు దారితీస్తోందన్నారు. ఇందులో భాగంగానే జంతువులను, పక్షులను, నీటిలో బ్రతికే జలచర జీవులకు హాని కలిగించరాదన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహించే వారు చట్టపరమైన శిక్షాలకు అర్హులవుతారని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలను వేయించాలన్నారు. పశువులు, జంతువులు,పక్షులను రవాణ చేయునపుడు జంతు రవాణ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు ఇందులో పాడి రైతులు, పెంపుడు జంతువుల పెంపకందారులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల అసభ్యకర ప్రవర్తన

● పాఠశాల హెచ్ఎం, ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. నర్సాపూర్ (జి)లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను కలెక్టర్ అబిలాష అభినవ్ సోమవారం సస్పెండ్ చేశారు. పాఠశాల హెచ్ఎం కిషన్‌రావుతో పాటు గణితం బోధిస్తున్న మనోహర్‌రెడ్డి, ఇంగ్లీష్ టీచర్ మోహన్‌రావులు తమపట్ల తరచూ అసభ్యకరంగా ప్రవర్తిస్తు న్నారని ఇటీవల పలువురు విద్యార్థినులు ఆరోపించారు. దీంతో ఉపాధ్యాయుల తీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో హెచ్ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అభిలాష అబినవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు ఆదివాసీ గిరిజనులు తమ గోడును వినిపించారు. ఇందులో రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాలు మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు సమస్యలతో కూడిన అర్జీలు అందించారు. ఇందులో ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంతరావు, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

'సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో తొలిసారిగా భారత రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళకు అవకాశం కల్పించడంతో దేశ ప్రజలు హర్షిస్తుంటే, రాష్ట్రపతి ముర్ము ప్రసంగాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన సోనియాగాంధీ వెంటనే రాష్ట్రపతికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగిస్తుండగా పూర్ లేడీ, పూర్ స్పీచ్, అంటూ సోనియా గాంధీ మాట్లాడడం విచారకరం అన్నారు. క్షమాపణల చెప్పకపోతే కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బానోత్ జగన్, ఆడే ధనలాల్, సాడిగే రాజేశ్వర్, సీపతి లింగాగౌడ్, కొండేరి రమేష్, బింగి వెంకటేష్, మరికంటి నారాయణ, తస్నీరు, బానోత్ ఉపేందర్, తదితరులు ఉన్నారు.

'బూటకపు హామీలతో అధికారంలోకి..'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి)కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నేరవేర్చేంత వరకు ప్రశ్నిస్తునే ఉంటామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీని మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం రామన్న మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చేసిన అభివృద్ధి పనుల తో పాటు తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని గుర్తు చేశారు. ఇందులో ఇజ్జగిరి నారాయణ, సాజిదొద్దిన్, బుట్టిశివ, ధమ్మపాల్, కొండాగణేష్, లక్ష్మణ్, అడప తిరుపతి, శ్రీనివాస్, అత్తఉల్లా, అయ్యుబ్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఉపాధ్యాయులు

బోథ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి ప్రశాంత్ అనే ఉపాధ్యాయుడు సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని పదిమంది ఉపాధ్యాయులతో కలిసి కలిసినట్లు తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం అని అంశంపైన సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్రిపురలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. కల్చరల్ డెవలప్‌మెంట్‌పైన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. జనవరి 21 నుంచి 30 వరకు శిక్షణ కార్యక్రమాలలో పాల్గొని అనంతరం సోమవారం గవర్నర్‌ను కలవడం జరిగిందని, పది రోజుల పాటు పలు అంశాలపైన శిక్షణ పొందడం జరిగిందని ఆయన వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్రంలోని 10 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



త్రిపుర గవర్నర్‌ను కలిసిన రాష్ట్ర ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు



శంకరిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం నాయకులు

తలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ బీజేపీ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోరని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గోకా గణేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు అన్యాయం జరిగిందని నిరసనగా రాష్ట్ర పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంగా ప్రధానమంత్రి జిల్లాకు వచ్చి మాటిచ్చిన ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, ఆదిలాబాదులో ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రీ కారిడార్‌లలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదన్నారు. బీజేపీ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీకి ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. అభివృద్ధి కోసం నిధులు తేవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ తరఫున అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఇందులో బొల్లారపు బాబన్న, మాజీ ఎంపీపీ కల్యాణ లక్ష్మీ, రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, నాయకులు సల్ల దేవన్న ప్రేమ్ రెడ్డి, రామచంద్ర దేశ్‌ముఖ్, రఫిక్ ,విలాస్ యాదవ్ రావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాకు తీరని అన్యాయం : ఆడే గజేందర్

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినతి పత్రాన్ని ఆడే గజేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, ఆదిలాబాద్ జిల్లాకు చట్టబద్ధంగా న్యాయంగా రావలసిన నిధులు రాకపోవడాన్ని, ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లాకు రావలసిన ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా, హైదరాబాద్ నాగపూర్ పారిశ్రామిక కారిడార్‌కి అనుమతులు, అటవీ, పర్వత ప్రాంతాలలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకానికి నిధులు విడుదల చేయక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో సవరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఇందులో పార్టీ అధ్యక్షులు ఆడే వసంత్ రావు, నాయకులు రాజశేఖర్ రెడ్డి. నారాయణ రెడ్డి. రూప్ సింగ్ కృష్ణ నాయక్, శంకర్, కపిల్ దేవ్, సద్దాం, బానోత్ వసంత్ రావ్. రమేష్. సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ సోమవారం మండలంకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఇందులో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. రాజు యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, యువజన కాంగ్రెస్ మండలం ఉపాధ్యక్షులు అరుణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సట్ల ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, రాష్ట్ర అభివృద్ధికి గాను ఈసారి బడ్జెట్‌లో నిధులు రాబట్టడంలో బీజేపీకి చెందిన ఎంపీ, నలుగురు జిల్లా ఎమ్మెల్యేలు విఫలమయ్యారని వారు తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్ డిమాండ్ చేశారు.

గుడిహత్నూర్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇందులో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగ్ నాథప్పా, మండల ప్రధాన కార్యదర్శి గున్నాల గణేష్ గౌడ్, కరుణాకర్, శ్యామ్ రావ్, అరిఫ్ ఖాన్, గణేష్, దేవ్ రావ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిందని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో నాయకులు సోమోరే నాగోరావు, ఫడ్ వరుణ్ పటేల్, పవార్ దుదరాం, ఎండీ జహార్, గాయక్ వాడ్ భగవాన్, ఎండీ జునైద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తాపీ మేస్త్రీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో తాపీ మేస్త్రీ సంఘం నాయకులు సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ సంఘం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

● వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అనిల్ జాదవ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అక్షర ఆసుపత్రి వైద్యుడు రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇచ్చోడ పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రోడ్డు ఏర్పాటు

బోథ్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రానున్న శివరాత్రికి సోనాల మండలం సమీపంలోని రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధి పనులు దాతల సహకారంతో ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయానికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను స్థానిక భక్తులు ప్రారంభించారు. శివరాత్రి రోజున శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించేందుకుగాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి జేసీబీ వాహనంతో రోడ్డు పనులు చేపట్టగా.. తుల సదానందం, సుభాష్, సూర్య, అడిపే శ్రీనివాసులు తమ వంతుగా ఆర్థిక సాయం అందించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆమె కాలికి ఉన్న కణితిని వైద్యులు సోమవారం శస్త్రచికిత్స చేసి తొలగించారు.

ముదురుతున్న ఎండలు

(5వ పేజీ తరువాయి...)

దోస, కర్బుజా పంటలను సాగు చేస్తూ.. సీజనల్ వ్యాపారానికి సిద్ధమవుతున్నారు.

అడుగంటిపోతున్న నీటిజాడలు

ముదురుతున్న ఎండలతో నీటి వనరులు అడుగంటుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. వాగులు, వంకలు, ఒర్రెల్లో నీటి దారలు ఆవిరవుతున్నాయి. దీంతో మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. ముఖ్యంగా వన్యప్రాణులు నీటి జాడల కోసం అడవులను వదిలి మైదాన ప్రాంతాలకు తరలివస్తున్నాయి. వాగులు, ఒర్రెలపై ఆధారపడి రబీలో పంటలను సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే నీటిదారలు అడుగంటడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని వాపోతున్నా రు. ప్రత్యామ్నాయ మార్గాల్లో పంటలను రక్షించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కూరగాయల ధరలు సైతం మండి పోతున్నాయి. ఎండల తీవ్రతకు కూరగాయల దిగుబడులు, అమ్మకాలపై ప్రభావం చూపుతున్నాయి. అలాగే వాతావరణంలో మార్పులు చోటు చేసు కోవడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారీన పడుతున్నారు. ముఖ్యంగా విష జ్వరాలు, దగ్గు, జలుబు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విష జ్వరాల బారీన పడిన వారి సంఖ్య మరీ ఎక్కువగానే కనిపిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ టీచర్ మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

నేరడిగొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాంకిడి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పై ఆదిలాబాద్ వైపు నుంచి నిర్మల్ వైపు వెళుతున్న టీఎస్18 హెచ్6407, భైంసాకు చెందిన టీఎస్ 01ఈసీ5354 అనే నెంబర్లు గల రెండు కార్లు ఒకదాన్ని ఒకటి ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోథ్ మండలం కౌటా గ్రామానికి చెందిన నోముల వెంకట్‌రెడ్డి రిటైర్ టీచర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

● కౌట(బి) గ్రామంలో విషాదఛాయలు

బోథ్: నేరడిగొండ మండలంలోని వాంకిడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కౌటా(బి) గ్రామానికి చెందిన నోముల వెంకట రెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వగ్రామానికి కుమారుడితో కలిసి సోమవారం కారులో వచ్చి నిర్మల్ తిరిగి వెళుతుండగా ప్రమాదం సంభవించింది. కారు ముందున్న మరో కారును ఓవర్ టెక్ చేస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి ముందున్న కారును ఢీ కొట్టినట్లు తెలిసింది. దీంతో ముందున్న కారు రోడ్డు పక్కన గుంతలు పడగా మృతి చెందిన ఉపాధ్యాయుడు ప్రయాణిస్తున్న కారు పల్టీలు కొట్టింది. దీంతో ముందు సీట్లో కూర్చున్న మృతుడికి తీవ్ర గాయాలు కావడంతో ఆయనను నిర్మల్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు సమాచారం. కౌటా(బి) గ్రామంలో నివాసం ఉంటున్న ఈయన గత పదేళ్ల క్రితం నిర్మల్‌లో ఉంటున్న ఆయన కుమారుని వద్ద ఉంటున్నారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన మృతితో ఆయన బంధువర్గంలో, గ్రామంలో విషాదం నెలకొంది.

'చలో హైదరాబాద్' పోస్టర్ల విడుదల

ఉట్నూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్‌లో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దాసరి రాంప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదారబాద్‌లో జరగనున్న 'వెయ్యి గొంతులు, లక్ష డప్పులు' వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా హైదరాబాదులో నిర్వహిస్తున్న కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ పరశురాం మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వాగ్మారే కిరణ్ మాదిగ, గవాలే సతీష్ మాదిగ, గ్రామ పెద్దలు హీరోలే మారుతి, గావాలె జ్ఞానోబా, తదితరులు పాల్గొన్నారు.

భక్తి

బుడుందేవ్‌కు మెస్రం గిరిజనుల సంప్రదాయ పూజలు

● షాంపూర్‌లో పూజలకు హాజరైన ఎమ్మెల్యే బొజ్జు ● షాంపూర్ జాతర ప్రారంభం



బుడందేవ్ ఆలయ ప్రాంగణం పరిసరాలలో గుడారాలు ఏర్పాటు చేసుకున్న మెస్రం గిరిజనులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే



సామూహిక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మెస్రం గిరిజనుల దైవం బుడుందేవ్ (నందీశ్వరుడు)కు ఆదివాసీ గిరిజనులు సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. నాగోబా జాతరలో నాలుగు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ పూజలు పూర్తి చేసుకున్న మెస్రం గిరిజనులు సోమవారం ఉదయం నాటికి ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌లో కొలువైన బుడందేవ్ జాతరకు చేరుకున్నారు. తమ వెంత వెచ్చిన పవిత్ర గంగాజలాలతో పాటు పూజ సామాగ్రితో తరలివచ్చిన మెస్రం గిరిజనులు పీఠాధిపతి మెస్రం వెంకటరావు ఆధ్వర్యంలో ముందుగా బుడందేవ్ ఆలయంలోకి పవిత్ర జలాలతో ప్రవేశించారు. నందీశ్వరుడి విగ్రహానికి పవిత్ర గంగాజలాలతో అభిషేకించి అనంతరం సాంప్రదాయ పద్ధతుల్లో నందీశ్వరుడికి సింధూరం అంటించి భక్తి శ్రద్ధలతో సంస్కృతి సంప్రదాయ వాయిద్యాల మధ్యలో పూజలు చేశారు. దీంతో షాంపూర్‌లోని బుడుందేవ్ జాతర ప్రారంభమైంది.

తరలివచ్చిన 500 కుటుంబాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మెస్రం గిరిజనులకు చెందిన 500 కుటుంబాలు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, కాలినడకన నాగోబా ఆలయం ప్రాంగణం నుంచి బుడుందేవ్ ఆలయం ప్రాంగణంకు చేరుకున్నారు. ఆలయం చుట్టూరా ఉన్న చెట్ల కింద, ఖాళీ ప్రదేశాలలో తమ వెంట తెచ్చుకున్న గుడారాలను వేసుకొని బస చేశారు. పిల్ల పాపలతో పాటు వృద్ధులు ఈ సంప్రదాయ పూజలకు తరలివచ్చారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉంచి తమ ఎడ్లబండ్లలో వంట సరుకులతో పాటు వంటపాత్రలు, పశుగ్రాసం కూడా తెచ్చుకున్నారు. పూజల అనంతరం ఒకరి గుడారం నుంచి మరోకరి గుడారంకు వెళ్లి ప్రతీఒక్కరు క్షేమ సమాచారం తెలుసుకుంటు పలకరించుకున్నారు.

పూజలు చేసిన ఎమ్మెల్యే

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ బుడుందేవ్ ఆలయానికి చేరుకొని మేస్రం గిరిజనులతో కలిసి బుడందేవ్‌కు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మెస్రం వంశీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేస్రం వెంకట్రావు, కోసూరావు, నాగోరావు తదితరులు ఆలయ ప్రాంతంలోని సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ సమాజానికి పెద్ద దిక్కుగా ఉంటూ మేస్రం వంశీయులు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో స్ఫూర్తి ప్రదాతలుగా ఉండిపోతున్నారని కొనియాడారు. బుడుందేవ్ జాతర ప్రాంగణంలోని మంచినీటి సమస్య పరిష్కారానికి అవసరమైతే మరో రెండు బోరుబావులు మంజూరు చేస్తానన్నారు. అదేవిధంగా ఆలయం నుంచి ఆర్‌అండ్‌బి రోడ్డు వరకు రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.



గోదావరి కలశంతో బుడుందేవ్ ఆలయంలోకి వస్తున్న మెస్రం గిరిజనులు



గోదావరి జలాలతో బుడుందేవ్‌కు అభిషేకం చేస్తున్న గిరిజనులు



ఆలయం ముందు సామూహిక పూజలు చేస్తున్న మెస్రం గిరిజనులు



గుడారంలో కూర్చుని పూజలు తిలకిస్తున్న కోసుబాయి

ఎమ్మెల్సీ ఎన్నికలకు
నామినేషన్లు షురూ

● తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు నామినేషన్లు
● ఉపాధ్యాయ స్థానానికి మూడు నామినేషన్లు

కరీంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సోమవారం ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కాగానే పట్టభద్రుల స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయుల స్థానానికి ముగ్గురు అభ్యర్థులు ఐదు నామినేషన్లు వేశారు. వీరిలో ఇద్దరు అభ్యర్థులు పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలు రెండింటికి నామినేషన్ వేశారు. పట్టభద్రుల స్థానంలో సిలివేరి శ్రీకాంత్ (జమ్మికుంట), గవ్వల లక్ష్మి (దేవునిగూడెం), చాలిక చంద్రశేఖర్ (హైదరాబాద్), మంచికట్ల ఆశమ్మ (ఆదిలాబాద్), కంటె సాయన్న (మేడ్చల్), దూడ మహిపాల్ (ధర్మపురి) నామినేషన్లు వేశారు. ఉపాధ్యాయుల స్థానానికి సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్, కూర రఘోత్తంరెడ్డి (గోనెపల్లి) నామినేషన్లు వేశారు. సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్ అటు పట్టభద్రుల స్థానానికి, ఇటు ఉపాధ్యాయుల స్థానానికి నామినేషన్లను దాఖలు చేశారు. కరీంనగర్ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఈ నామినేషన్లను స్వీకరించారు.

● 10 వరకు నామినేషన్ల స్వీకరణ

ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు తాను రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నానని, ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. 8,9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉండడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని, మిగతా పని దినాల్లో ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని ఆమె తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి పూర్తికాగానే ఫలితాలు ప్రకటిస్తామని చెప్పా రు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సందేహాలను నివృత్తి చేసేం దుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా ఎన్ని కల నియమావళిని కచ్చి తంగా పాటించాలని, ర్యాలీలు, సభలు, సమావేశా లకు ముందస్తు అనుమతి తీసు కోవాలని ఆమె సూ చించారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మంచికంట్ల లక్ష్మీ

నేత్రపర్వంగా బద్ది పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

● కొలువుదీరిన అమ్మవారు ● శాస్త్రోక్తంగా చండీహోమం, పూర్ణాహుతి ● భారీగా తరలివచ్చిన భక్త జనులు ● ఇంటింటా ఆడపడచుల సందడి



కొలువుదీరిన అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పూర్ణాహుతిలో పాల్గొన్న జంటలు



వేడుకలకు హాజరైన మహిళలు

భైంసా, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భట్టిగల్లీలో సోమవారం శ్రీ బద్ది పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగాయి. ఉదయం వేళలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాహలం మధ్య పారంభమైన వేడుకలు మధ్యాహ్నం వేళ వరకు కొనసాగాయి. రెండు రోజులుగా అమ్మవారికి జల, ధాన్య, శయ దివాస్ పూజలను చేపట్టిన పండితులు సోమవారం ఉదయం ఆలయంలోని గద్దెపై అమ్మవారికి ప్రతిష్టాపన పూజలను చేపట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్తంగా స్థాపన గావించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొలువు దీరిన బద్ది పోచమ్మ తల్లికి కాలనీ మహిళలు శోభయమానంగా అలంకరించారు. తొలిపూజలను విగ్రహ దాత వడ్నపు రాజేశ్వర్ దంపతులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో పూర్ణహుతి చేపట్టారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్, బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యులు డా. కిరణ్ కోమ్రేవార్, విలాస్ గాదేవార్,హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు.

● భారీగా తరలివచ్చిన భక్తజనం

అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బద్దిపోచమ్మ ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయి కనిపించాయి. భట్టిగల్లి, గణేష్‌నగర్ కాలనీలన్నీ భక్తులతో జనసంద్రంగా మారిపోయాయి. విగ్రహ ప్రతిష్టాపన సమయంలో అమ్మవారి నామస్మరణ చేపడుతూ భక్తులు పరవశించిపోయారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యారు. ప్రతిష్టాపనోత్సవాలు ముగిసిన అనంతరం ఆలయ కమిటీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది.

● ఇంటింటా ఆడపడుచుల సందడి

విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గాను వివిధ ప్రాంతాల్లోనున్న భట్టిగల్లి, గణేష్‌నగర్ కాలనీలకు చెందిన ఆడపడుచులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చారు.దీంతో రెండు కాలనీల పరిధిలోని ప్రతి ఇంట ఆడపడుచుల సందడి నెలకొంది. విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ముగిసిన పిదప ఆలయ కమిటీ ప్రతినిధులు వేడుకలకు హాజరైన ఆడపడచులందరికి కానుకగా హారతి పళ్లెం, దీపపు మాణిక్యాల జతను అందించారు. .

అర్హతలున్నా.. అందని రైతు భరోసా!

● పంటపొలం నుంచి రాహుల్‌గాంధీకి సెల్ఫీ వీడియోలను పంపిన ముక్రా(కె) రైతులు

ఇచ్చోడ, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి): మేమేం పాపం చేశాం.. మాకు రైతు భరోసా తెలంగాణ ముఖ్యమంతి వేయట్లేదని.. అన్ని అర్హతలు ఉండి కూడా రైతు భరోసా రావట్లేదంటూ.. ముక్రా(కె) గ్రామ రైతులు పంట పొలం నుంచి సెల్ఫీ విడియోలను చరవాణ ద్వారా రాహుల్‌గాంధీకి చెరవేసినట్లు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. ప్రతీ రైతుకు రైతు భరోసా ఎకరానికి 15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసుకుందని కేవలం ఆ గ్రామ రైతులకే రైతు భరోసా కల్పిస్తుందన్నారు. మిగితా గ్రామాల రైతులు ఏం పాపం చేశారని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పులు చేసి మరీ రబీ పంటలను సాగు చేస్తున్నామని.. ఇప్పటికైనా రైతుల బాధలు అర్థం చేసుకొని రైతు భరోసాను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గాడ్గె మీనాక్షి, సుభాష్, విట్టల్, తులసీరాం, దత్త, నాగనాథ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పంట పొలంలో సెల్ఫీ వీడియోలు తీసుకుంటున్న ముక్రా(కె) రైతులు

మురుగుతో ముప్పు తిప్పలు

కుభీర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుభీర్‌లో ప్రధాన రహదారులకు ఇరు పక్కల గల మురుగు కాల్వలు పూడిక తీతకు నోచుకోవడం లేదు. నెలల తరబడి మురికి కాల్వల్లో వ్యర్థాలు పేరుకు పోయినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కాల్వలు నిండిపోయి ఇళ్లలోని మురుగు నీరు పారే అవకాశం లేకుండా పోయింది. గ్రామ పంచాయతీ నుంచి అన్నబాహుసాతే కూడలికి వెళ్లేమార్గంలోని కుడివైపున గల కాల్వ నిండి పోయి మురుగు నీరు ప్రవహించక పోవడంతో అమార్గం గుండా వెళ్లే గ్రామస్తులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసనతో పాటు దోమలు పెరిగి పోయాయి. చీకటి పడితే చాలు దోమల బెడదతో నరకయాతన పడుతున్నారు. జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. ఇప్పటికయిన సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



కుభీర్‌లో మురుగు కాలువ



ప్రత్యేక అలంకరణలో ముస్తాబైన సాయిబాబా విగ్రహం



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భక్తులతో కిటకిటలాడిన హనుమాన్‌సాయి ఆలయం

● వేడుకగా 25వ ఆలయ వార్షికోత్సవం ● పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బోథ్ ఎమ్మెల్యే

ఇచ్చోడ, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రంలోని గత 25ఏళ్లుగా వసంత పంచమి పర్వదినం రోజున ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామునే వీర హనుమాన్ విగ్ర హానికి, సాయిబాబా విగ్రహానికి అభిషేకం నిర్వ హించి వేదపండితుల నడుమ ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ప్రత్యేకంగా అలంకరించిన సాయిబాబా విగ్రహానికి, ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బాజా భజంత్రీల మధ్య పల్లకీ సేవను ఇచ్చోడ పట్టణంలోని పురవీధులగుండా డీజే చప్పుళ్ల మధ్య ఘనంగా భక్తులు ఊరేగించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన జాతరలో తిరుగుతూ భక్తులతో సందడి చేశారు. ప్రతీ యేడులానే ఈ ఏడాది కూడా వసంత పంచమిని పురస్కరించుకొని సాయి బాబా సన్నిధిలో అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇచ్చోడ మండల కేంద్రంలో అతిపెద్ద జాతర ఇక్కడ జరగడం చుట్టుపక్క ప్రాంతాలనుంచి దాదాపు 15వేల మంది భక్తులు హాజరై తమతమ మొక్కులను చెల్లించుకుంటారు. ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి, పోలీసు సిబ్బంది జాతరలో బందోబస్తును నిర్వహించారు. అనంతరం మహా ప్రసాదం అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బాబా దర్శనానికి బారులు తీరిన భక్తులు



అన్నదాన సేవకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

ఎండుతున్న వాగులు, పంటలు

ఆంధ్రజ్యోతి పరిశీలన



బోథ్ పెద్ద వాగు ఎండిపోవడంతో వాగులో తిష్ట వేసిన గేదెలు



నీరందక ఎండుతున్న మొక్కజొన్న పంట

బోథ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రవేశించడంతోనే మండలంలోని పలు వాగులు ఎండిపోతున్నాయి. వాగుల నుంచి పైప్‌లైన్ వేసుకొని మోటార్ల ద్వారా నీటి తడులు పెట్టే రైతులు తమ కండ్ల ముందే పంటలు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

● వాగు చుట్టూరా మోటార్లతో..

రైతులు రబీ కింద ప్రతీ ఏడాది వేల ఎకరాలలో జొన్న మొక్కజొన్న సెనగ గోధుమ పంటలను సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది సైతం వాగు నీరు ఉంటుందన్న ఉద్దేశంతో పంటలను వేయడం జరిగింది. అయితే ఈ ఏడాది అకస్మాత్తుగా వాగు ఎండిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వాగులలో విద్యుత్ మోటార్లు వేసుకొని రైతులు పంటలు పండించుకుంటూ ఉండగా వాగులో నీరు ఇంకిపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. వాగులను జేసీబీల ద్వారా గుంతలు తవ్వి సాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తున్న నీటి వనరుల జాడ లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు.

● పశువులకు తాగునీటికి ఇబ్బందులు

వర్షాకాలం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పాటు వాగులలో మోటర్లు బిగించి పంటలకు సాగునీటిగా వినియోగిస్తున్నారు. అయితే దీంతో వాగు లు ఏడాది రెండు నెలల ముందుగానే ఇంకిపోవడంతో నీరు లేక వాగులు వెలవెలబోతున్నాయి. దీంతో ఈ ఏడాది పశువులకు సైతం తాగునీటి ఎద్దడి తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు తాగు నీటి వసతి కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.

● కెనాల్ నీటిని విడిచి పెట్టండి

బోథ్, కరత్వాడ చెరువు నీటిని కాలువల ద్వారా విడిచిపెట్టి చెక్‌డ్యాం నింపాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై గత రెండు రోజుల క్రితం పొచ్చెర కనుగుట్ట గ్రామాలకు చెందిన రైతులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కరత్వాడ చెరువు నుంచి కాలువల ద్వారా చెక్ డ్యాములను నింపినట్లైతే పంటల కు సాగునీరు అందుతుందని అంతేగాక పశువులకు సైతం తాగునీరు లభించే అస్కారం ఉందని అంటున్నారు. పొట్ట దశలో ఉన్న జొన్న, మొక్కజొన్న పంటలతో పాటు శనగ పంట చేతికందేలా లేదని అంటున్నారు. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జనవరి 28 నుంచి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలిలా..

రోజు	గరిష్ఠం	కనిష్ఠం
జనవరి 28	33.8	14.2
జనవరి 29	34.3	19.7
జనవరి 30	34.0	20.5
జనవరి 31	34.8	19.8
ఫిబ్రవరి 1	35.3	20.2
ఫిబ్రవరి 2	36.3	19.2
ఫిబ్రవరి 3	36.5	17.2



సాంప్రదాయ వాయిద్యాలను మోగిస్తున్న ఆదివాసీలు

బుడుందేవ్‌కు మెస్రం గిరిజనుల పూజలు

- హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- షాంపూర్ జాతర ప్రారంభం -7లో...



ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కూర రఘోత్తంరెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ

- తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు
- ఉపాధ్యాయ స్థానానికి మూడు -7లో...

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మానంద్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ సంఘటన పర్వ్ ఎన్నికల నియమావళి ఆధారంగా జిల్లా ఎన్నికల అధికారి బస్వాపురం లక్ష్మీ నర్సయ్య హైదరాబాద్‌లో వారి చేతుల మీదుగా జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రాలను స్వీకరించారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవిని ఇచ్చిన రాష్ట్ర నాయకులకు, పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల శంకర్, జిల్లా నాయకులకు ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు.

- జిల్లాలో 36.5 డిగ్రీలకు చేరుకున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఎండల తీవ్రతతో ఎండుముఖం పడుతున్న పంటలు
- వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు
- వేసవి ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతల నమోదు
- ఊపందుకుంటున్న వేసవి సీజన్ వ్యాపారాలు

ముదురుతున్న.. ఎండలు



బోథ్‌లో సాగునీరు అందక ఎండిపోతున్న మొక్కజొన్న పంట

ఆదిలాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే జిల్లావాసులను తీవ్రమైన ఎండలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. శీతాకాలం ముగిసి పోవడంతో గత నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫిబ్రవరి 1నుంచి ఎండల తీవ్రత మరీ ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 36 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతల తీవ్రత మరింతగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో వర్షాకాలం, శీతాకాలం, వేసవి కాలాలు అధికంగానే ప్రభావాన్ని చూపుతాయి. జనవరి చివరి వరకు రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో తీవ్రమైన చలి కనిపించింది. వేసవి ప్రారంభం కావడంతో ముదురుతున్న ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సోమవారం జిల్లాలో పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36.5 డిగ్రీలు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. గతేడు వేసవిలో అత్యధికంగా 45.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలు ఉన్నాయి. ఫిబ్రవరిలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే రాబోయే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండల తీవ్రత అంతగా లేకపోయినా.. మధ్యాహ్న సమయంలో మాత్రం బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అయితే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు అవసరమైన ఏర్పాట్లను చేసుకుంటున్నారు.



జిల్లాకేంద్రంలో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన రంజన్లు

ముదురుతున్న ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

: పెందూరు జైతుపటేల్, రైతు, తలమడుగు మండలం



గత కొద్ది రోజులుగా ముదురుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్నాం. మధ్యాహ్నం సమయంలో వ్యవసాయ పనులను నిలిపివేసి సేదతీరుతున్నాం. ఇప్పుడే ఎండలు ఇట్లా ఉంటే.. రాబోయే రోజుల్లో ఎలా ఉంటాయో అర్థం కావడం లేదు. ఎండల తీవ్రత వల్ల పంటలకు నీటి తడులను ఎక్కువగా అందించాల్సి వస్తుంది. కొన్నిచోట్ల బోరు బావులు, ఒర్రెలు, వాగులు అడుగంటుతున్నాయి. వేసిన పంటలు ఎలా చేతికి వస్తాయో? తెలియడం లేదు. ఈ యేడు తీవ్రమైన చలి మాదిరిగానే.. ఎండలు కూడా తీవ్రంగానే ఉంటాయని అంటున్నారు.

మార్కెట్లో 'సీజనల్' సందడి



వేసవి సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. జిల్లాకేంద్రంతో పాటు పలు మండల కేంద్రాలలో శీతల పానియాల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కూలర్‌ల తయారీలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. ప్రతియేటా వేసవి సీజనల్‌లో జిల్లా నుంచే ఇతర ప్రాంతాలకు భారీగా కూలర్స్, రంజన్లను భారీ ఎత్తున తరలిస్తారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ రంజన్లకు మంచి డిమాండ్ ఉంది. అలాగే మూలనపడి ఉన్న కూలర్, ఏసీ, ఫ్రిజ్, ఫ్యాన్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇన్నాళ్ల చలి తీవ్రతకు ఉపయోగంలో లేని ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ముదురుతున్న ఎండలకు గిర్రున తిరుగుతున్నాయి. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్‌లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే సీజన్ ఊపందుకుంటే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇళ్లపై కప్పులు, ఇంటి ముందు చల్లని పందిర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే రైతులు వేసవిలో తీసుకునే జాగ్రత్తలు, పండించే పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలో

(తరువాయి 6వ పేజీలో...)

ఘనంగా వసంత పంచమి వేడుకలు

- జిల్లావ్యాప్తంగా చదువుల తల్లి సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు
- పలుచోట్ల పెద్దఎత్తున కొనసాగిన అక్షరాభ్యాస కార్యక్రమాలు



జిల్లాకేంద్రంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న వేద పండితుడు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజైన వసంత పంచమి వేడుకలను సోమవారం జిల్లా అంతటా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడింది. జిల్లాకేంద్రంలో వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. వసంత పంచమి సందర్భంగా భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో వసంత పంచమని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి చిన్నారులకు అక్షర శ్రీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అక్షరాభ్యాసం వసంత పంచమిన చేపట్టడం ద్వారా చిన్నారులకు శుభం కలుగుతుందన్నారు. చిన్నారులకు సంస్కారాలను నేర్పడంలో తల్లిదండ్రుల తర్వాత గురువు పాత్ర అనిర్వచనీయమైనదన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు కాలనీలనుంచి తరలివచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాన్ని చేయించారు.

ఆదిలాబాద్ రూరల్: వసంత పంచామని పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని శిశు మందిర్‌లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల నడుమ చేపట్టారు. అంతకుముందు చిన్నారుల తల్లిదండ్రుల హోమాది క్రతువులో పాల్గొని అమ్మ వారిని ఆరాధించారు.

ఉట్నూర్: మండలంలో సోమవారం వసంత పంచమి ఉత్సవాలు ఘనంగా ప్రజలు నిర్వహించుకున్నారు. వసంత పంచమి పురస్కరిచుకోని మండల కేంద్రంలోని సన్ షైన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సరస్వతి దేవికి పూజలు చేశారు. అనంతరం స్పోర్ట్స్ మీట్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. గెలుపొందిన వారు గర్వపడకుండా మరో గెలుపు కోసం కృషి చేయాలని ఓడిపోయిన వారు డీలపడకుండా ఓటమికి గల కారణాలు వెతుక్కొని గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఇందులో కరస్పాండెంట్లు మహమ్మద్ షబ్బీర్, డాక్టర్ సాడిగే రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి వేడుకలను జరుపుకున్నారు. మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు గావించారు. వేద పండితులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ విద్యార్థులకు వసంత పంచమి ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల వ్యాప్తంగా సోమవారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. మండల కేంద్రంలో గల శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో సామూహిక అక్షరభ్యాసం చేయించగా.. శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



ఉట్నూర్‌లో బహుమతులను అందజేస్తున్న ఏఎస్పీ కాజల్



సరస్వతి వేషధారణలో చిన్నారి



బోథ్‌లో అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు



నేరడిగొండలోని శిశు మందిర్‌లో అక్షరాభ్యాసం..



సంచార చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇందిరా మహిళా శక్తి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా రూ.10 లక్షల విలువైన సంచార చేపల విక్రయ వాహనం మంజూరైంది. కాగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వాహనాన్ని ప్రారంభించి జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామానికి చెందిన సరస్వతి మహిళా సమాఖ్య సభ్యురాలు టాప్రే సునీతకు అందించారు. ఈ వాహనం ద్వారా పరిసర నీటివనరుల్లో లభించే వివిధ రకాల చేపలు, వాటితో తయారయ్యే భిన్న రుచుల వంటకాలను విక్రయించనున్నారు. జాతరలు, పార్కులు, ప్రధాన కూడళ్లు, మార్కెటింగ్ ఏరియాల్లో సంచార వాహనాన్ని నిలిపి విక్రయాలు సాగించనున్నారు. ప్రజలకు నాణ్యమైన నమ్మకమైన చేపలను అందించడంతో పాటు వ్యాపారానికి ముందుకు వచ్చే స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వ తోడ్పాటుతో సంచార చేపల విక్రయ వాహనాన్ని అందించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, జిల్లా మత్స్యశాఖాధికారి జైభాస్కర్, జైనథ్ ఇన్‌చార్జీ తహసీల్దార్ రాజేశ్వరి రాథోడ్, డీపీఎం సుగంధ, ఏపీఎంలు స్వామి, భగవాండ్లు, సీసీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ

ఆదిలాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తు దారులు అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలను దరఖాస్తు రూపంలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు అందించారు. వివిధ శాఖలకు సంబంధించి డీఆర్‌డీఓ, డీపీఓ, డీడబ్ల్యూఓ, ఉపాధి, వ్యవసాయం, రెవెన్యూ, తదితర 78 దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందించి తక్షణమే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్‌డీఓ వినోద్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు నిల్

- కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి
- ఉట్నూర్‌లో ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025-26 బడ్జెట్‌లో జిల్లాకు గుండుసున్నా కేటాయింపులు జరిగాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ నిధులను సాధించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రజలు నలుగురు ఎమ్మెల్యేలను, ఎంపీని గెలిపిస్తే జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. జీఎస్టీ రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న కోట్లాది రూపాయలను ఇవ్వకుండా.. కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఇందులో దిగంబర్‌రావుపాటిల్, అశోక్‌రెడ్డి, గిమ్మ సంతోష్, డేరాకృష్ణారెడ్డి, గుడిపెల్లినగేష్, ఫైజుల్లాఖాన్, జహీర్‌రంజానీ, ఆవుల వెంకన్న, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సందనర్సింగ్, లోకప్రవీణ్‌రెడ్డి, షకీల్ తదితరులున్నారు. అలాగే అంబేద్కర్ చౌక్‌లో కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచుశ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, ఎన్డీయే భాగస్వామ్య రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయించారని, కేవలం కార్పొరేట్‌కు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. బిహార్, ఢిల్లీ, ఏపీ, గుజరాత్‌లకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నర్సింహచారి, అనువుల ఊశన్న, నాగరాజు, పరమేశ్వర్, రంజిత్‌రెడ్డి, అబిబ్, వాసీం, ప్రవీణ్, ప్రభాకర్, కమర్‌బేగం తదితరులున్నారు.



జిల్లాకేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఉట్నూర్‌లో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ఉట్నూర్‌లో కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ఉట్నూర్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయింపులో గాడిదగుడ్డు ఇచ్చిందని నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ పిలుపుమేరకు నిరసన చేపట్టి, దేశ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రనికి తీరని నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖయ్యూం, ఎఎంసి వైస్ చైర్మన్ బినోత్ జైవంత్ రావు, దూట రాజేశ్వర్, మహమ్మద్ ఇక్బాల్,రాజేష్ నాయక్, మర్సు కొల తిరుపతి, ఆత్రం రహుల్ , కోట్నాక్ ఉమేష్, దాసండ్ల ప్రభాకర్, బిరుదుల లాజర్, లింగంపల్లి చంద్రయ్య, యాకుబ్‌బేగ్, నరసయ్య, రాధాబాయి, నీలాబాయి, అన్నపూర్ణ, డైరెక్టర్ రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.